# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
2. **రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.**
3. **పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.**
4. **వనమహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రేపు పల్నాడు జిల్లాలో ప్రారంభిస్తారు.**
5. **ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ఈ రోజు.**

**===========================**

ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈరోజు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన క్రీడా ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, యువత క్రీడారంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిధులతో క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

---------------------------

గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆముదాలవలస శాసన సభ్యులు కె.రవికుమార్ పాల్గొన్నారు. జిల్లాలో జన్మించిన గిడుగు రామమూర్తి పంతులు తెలుగుభాషకు చేసిన సేవ చిరస్మరణీయమని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు, తిరుపతి జిల్లాల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొని రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

---------------------------

గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ఈరోజు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సామాజిక మాధ్యమం వేదికగా తెలుగుభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగు వ్యవహారిక భాష ఉద్యమానికి మూలపురుషుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని తెలిపారు. తెలుగు భాష గొప్పదనాన్ని భావి తరాలకు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఇలా ఉండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. తెలుగు ఎంతో అద్భుతమైన భాష అని ప్రధానమంత్రి పేర్కొంటూ..

..వాయిస్.. 17 సెకన్లు

---------------------------

పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని, అందుకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల విజయ మహా గణపతి విగ్రహానికి సంబంధించిన కరపత్రాన్ని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 8 ప్రముఖ దేవాలయాల్లో స్వామివార్ల కల్యాణోత్సవానికి ఉపయోగించే దేవతా విగ్రహాలను తీసుకొచ్చి ఉత్సవాల అన్ని రోజులు అక్కడి అర్చకులే కల్యాణాలను నిర్వహిస్తారని వివరించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే వనమహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రేపు పల్నాడు జిల్లాలో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నరసరావుపేట మండలం కాకాని జేఎన్టీయూ ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమం జరగనుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర సంస్థల్లో ఏకకాలంలో నిర్వహించే వనమహోత్సవానికి అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలనిన అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ఈ రోజు. 1905 ఆగస్టు 29వ తేదీన ఉ త్తరప్రదేశ్లోని అలహాబాద్ నగరంలో జన్మించిన ఆయన హాకీ క్రీడలో ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరుగా ఖ్యాతి గడించారు. 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో ఆయన భారతదేశానికి వరుసగా స్వర్ణ పతకాలు సాధించి... దేశ ప్రతిష్టను ఇనుమడింప చేశారు. హాకీ క్రీడా మాంత్రికునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తోంది.

హాకీ క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ... కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్ పురస్కారంతో సత్కరించింది.

---------------------------

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు.. రాష్ట్రంలోనూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పలు జిల్లాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్, తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో క్రీడా ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ క్రీడలను భాగం చేసుకోవాలని తెలిపారు.

---------------------------

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే వారి కోసం అన్వేషిస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రతిభావంతులు, వినూత్న ఆలోచనలు ఉన్న వారికి ఆహ్వానం పలుకుతున్నామని సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. ప్రతిభావంతుల నుంచి సెప్టెంబరు 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రాష్ట్రంలోనూ ఐటీ విప్లవం వచ్చేలా కృషి చేస్తామని, తయారీ రంగం అభివృద్ధికి పెట్టుబడిదారులు ముందుకొస్తున్నారని చెప్పారు. మానవ వనరులు, మౌలిక వసతులు, నాణ్యతా ప్రమాణాల పెంపుపై ప్రణాళిక రూపొందిస్తున్నామని లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కలిగేలా నూతన వంగడాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. పత్తిలో వ్యర్థాల తొలగింపు, రైతులకు అధిక ధర లభ్యత అంశాలపై రాష్ట్ర సచివాలయంలో నిన్న మిల్లర్లు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయ శాస్త్రవేత్తలు, అధికారులతో మంత్రులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తే మిల్లర్లకు పన్ను సుంకం తొలగిస్తామన్నారు. పత్తి దిగుబడుల పెంపు, వ్యర్థాల నివారణపై మహారాష్ట్ర, తెలంగాణల్లో పరిస్థితులను అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పత్తి రైతులు ఈ-క్రాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంత్రులు సూచించారు.

---------------------------

ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే సెప్టెంబరు నెల పింఛన్‌లను ఈ నెల 31నే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. 1న ఆదివారం సెలవు కావడంతో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 31న అందుకోలేకపోయిన లబ్ధిదారులకు 2న అందించాలని ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత వరకు 31నే 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. 30వ తేదీ నాటికే బ్యాంకుల్లో పింఛను నగదు జమ చేస్తామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపింది. ముందస్తు పంపిణీ విషయాన్ని లబ్ధిదారులకు తెలపాలని సూచించింది.

---------------------------

వక్ఫ్ బోర్డు ఆస్తులపై పేద ముస్లింలకు హక్కు కల్పించేందుకే కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ అన్నారు. నిన్న విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ముస్లింలకు మేలు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఎన్డీయే ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందన్నారు. జన్ ధన్ ఖాతా, ముద్రా యోజన వంటి సంక్షేమ పథకాలలో ముస్లిం మహిళలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. కొత్త చట్టంతో ప్రతీ పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులపై హక్కు లభిస్తుందని ట్రిపుల్ తలాక్ రద్దు నిర్ణయంతో ముస్లిం మహిళలకు న్యాయం జరిగిందని షేక్ బాజీ వివరించారు.

======================